అమృత్ తెలంగాణ
తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 239. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ బుధవారం.11.06.2025 పేజీలు:4, వెల:రూ.1.00


## చిన్నారికి అండగా నిలిచిన మంత్రి

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: పెద్దపల్లి జిల్లాలో ఈ నెల 5న జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో, అదే జిల్లాలోని బసంత్‌నగర్‌కు చెందిన గుంటిపల్లి రాము, ఆయన భార్య అనూష మరణించారు. వీరి మూడున్నరేండ్ల కూతురు సహస్ర తీవ్రంగా గాయ పడింది. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు ఆమెను తొలుత కరీంనగర్‌కు, అక్కడి నుంచి మంగళవారం హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆస్పత్రికి తరలించారు. సహస్ర పరిస్థితిపై మీడియాలో వచ్చిన వార్తలు చూసి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చలించి పోయారు. సహస్ర ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. చిన్నారి సహస్రకు పూర్తి ఉచితంగా వైద్య సేవలు అందించాలని ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. చికిత్సకయ్యే ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. మంత్రి ఆదేశాలతో హైదరాబాద్ డీఎంహెచ్‌వో, డాక్టర్ వెంకట్ రెయిన్‌బో హాస్పిటల్‌కు వెళ్లి సహస్ర ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారిని ఓదార్చారు.

## గ్రూప్-3 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన వాయిదా

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో గ్రూప్-3 పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే ధ్రువపత్రాల పరిశీలన వాయిదా పడింది. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 18 నుంచి వచ్చేనెల ఎనిమిదో తేదీ వరకు హైదరాబాద్‌లోని నాంపల్లి సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో గ్రూప్-3 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని షెడ్యూల్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. కొందరు అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు గ్రూప్-2 నియామకాల ప్రక్రియ పూర్తయ్యాక గ్రూప్-3 ధ్రువపత్రాల పరిశీలన చేపట్టాలని నిర్ణయించామని పేర్కొన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులు మిగలకుండా ఉండొద్దనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇతర వివరాల కోసం షషష.రజూరష.స్త్రశీ.ఱఅ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. గతనెల 29 నుంచి ఈనెల పదో తేదీ వరకు గ్రూప్-2 అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ కొనసాగిన విషయం తెలిసిందే.

# విద్యుత్ ఉద్యోగులకు రూ.కోటి ప్రమాద బీమా

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్ర, దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తున్న 51,868 మంది విద్యుత్ ఉద్యోగులకు కోటి రూపాయల ప్రమాద బీమా పథకం రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచే కార్యక్రమమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం హైదరాబా ద్‌లోని ప్రజాభవన్‌లో విద్యుత్ ఉద్యోగులకు కోటి రూపాయల ప్రమాద బీమాపై బ్యాంకర్లతో ఒప్పందం చేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో భట్టి ప్రసంగించారు. రాష్ట్ర ప్రజల కోసం పనిచేసే ప్రధాన సంస్థల్లో ఒకటైన విద్యుత్ సంస్థ సిబ్బంది, కుటుంబాల కోసం ప్రమాద బీమా పథకం తీసుకురావడం వ్యక్తిగతంగా తనకు తృప్తినిచ్చిందని తెలిపారు. విద్యుత్ శాఖ ఉద్యోగులు ప్రాణాలు అడ్డుపెట్టి విధులు నిర్వహిస్తారని కొనియాడారు. రాష్ట్ర జీడీపీ పెరుగుదలకు ఈ శాఖ ఇంధనంగా ఉపయోగపడుతున్నదన్నారు.



ఉద్యోగుల హొదాలు వేరైనా వారి కుటుంబాల విషయంలో మాత్రం ఒకే రకమైన అనుబంధం, బాధ్యత ఉంటాయని గుర్తుచేశా రు. ఇంటిపెద్దకు ఏదైనా ప్రమాదం జరిగితే ఆయా కుటుంబాలు తలకిందులవుతాయనీ, అలాంటి పరిస్థితి రావద్దని ఆకాంక్షించారు. అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగితే ఆ కుటుంబాలను ఆదుకునేందుకే ఈ ప్రమాద బీమా పథకానికి శ్రీకారం చుట్టామని డిప్యూటీ సీఎం వివరించారు. ఈ పథకంలో సిబ్బంది కాంట్రిబ్యూషన్ లేదనీ, దీంతో ఉద్యోగుల్లో మనోధైర్యం పెరిగి, ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సంక్షేమ బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతా తెరిచిన ఉద్యోగులకు కేవలం ప్రమాద బీమానే కాకుండా వివాహం, విద్యాపరమైన ఆర్థిక సహాయంలోనూ ఆ బ్యాంకు రుణాలు అందించి చేయూతనివ్వనుందని వెల్లడించారు. ప్రమాదవశాత్తు శాశ్వత అంగవైకల్యం పొందిన వారికి రూ.80 లక్షల పరిహారం అందుతుందని తెలిపారు. ఈ ఖాతా తెరిచిన ఉద్యోగుల అకౌంట్‌లో జీరో బ్యాలెన్స్ ఉన్నప్పటికీ సేవలు వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు. ఏటీఎం కార్డు, చెక్‌బుక్ సేవలపై ఎటువంటి చార్జీలు ఉండవని స్పష్టం చేశారు. సహజ మరణం చెందితే రూ.10 లక్షల వరకు ప్రమాద బీమా ఉంటుందనీ, ఉద్యోగితో పాటు నలుగురు కుటుంబ సభ్యులకు కలిపి రూ. 20 లక్షల వరకు బీమా సౌకర్యం వర్తిస్తుందని తెలిపారు. గతంలో తాను జాతీయ బ్యాంకు డైరెక్టర్‌గా విధులు నిర్వహించానని భట్టి గుర్తుచేశారు. ఎడ్యుకేషన్ లోన్ ఇచ్చేందుకు నిబంధనలను సరళీకరిస్తూ, అర్బన్ ప్రాపర్టీ, నెలవారి జీతం లేకున్నా ఎడ్యుకేషన్ లోన్ ఇవ్వాలని బోర్డులో తీర్మానం పెట్టి తాను ఆమోదింపజేసినట్టు తెలిపారు. నాటి ప్రతిపాదనల మూలంగా డాక్టర్ పట్టాభి ఎడ్యుకేషన్ లోన్, డాక్టర్ పట్టాభి కిసాన్ క్రెడిట్ కార్డు వంటి పథకాలు వెలుగులోకి వచ్చాయని చెప్పారు. విద్యుత్ ఉద్యోగుల కోసం తెస్తున్న ప్రమాద బీమా పథకం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వానికి తృప్తినిచ్చే కార్యక్రమమని అన్నారు. 2023తో పోలిస్తే 2025లో పీక్ డిమాండ్ 17,162 మెగావాట్లు వచ్చిందనీ, గతంతో పోలిస్తే 2,000 మెగావాట్ల డిమాండ్ అదనంగా పెరిగినా విద్యుత్ సరఫరాలో చిన్న అంతరాయం లేకుండా రాష్ట్ర విద్యుత్ సిబ్బంది చూసుకున్నారని ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలిపారు.

హైదరాబాద్‌కు పెట్టుబడుల రాక

రీజినల్ రింగ్ రోడ్డు, మూసీ పునర్జీవం, ఫ్యూచర్ సిటీ ఇలా రకరకాల ప్రాజెక్టులు రాష్ట్రంలో ప్రారంభమై నట్టు భట్టి వెల్లడించారు. రీజినల్ రింగ్ రోడ్డుతో రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే వివిధ క్లస్టర్లతో ప్రపంచ నలుమూలల నుంచి పెట్టుబడి కోసం అంతా హైదరాబాద్‌కు తరలివస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని విద్యుత్ ఉత్పత్తి పెంచడంతోపాటు కాలుష్య రహిత గ్రీన్ ఎనర్జీని సమకూర్చు కునేందుకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలతో పని చేస్తున్నదని వివరించారు. గత పది సంవత్సరాలు ప్రత్యేక విద్యుత్ పాలసీ లేకపోవడంతో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మనం వెనుకబడిపోయామని వివరించారు. ఈ లోటును గుర్తించి ప్రభుత్వం ఏర్పడగానే 2025 న్యూ గ్రీన్ ఎనర్జీ పాలసీని తీసుకువచ్చామని గుర్తుచేశారు. 2030 నాటికి 20వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్నదని చెప్పారు. ఒకవైపు ఉత్పత్తి పెంచుకుంటూనే సరఫరాలో 75 శాతం లక్ష్యాన్ని చేరుకోగానే సరఫరా వ్యవస్థను అప్డేట్ చేసుకుంటూ ముందుకు పోతున్నామని చెప్పారు. అందుకే అదనంగా రెండు వేల మెగావాట్ల పీక్ డిమాండ్ వచ్చినా రాష్ట్రంలో రెప్పపాటు అంతరాయం లేకుండా ఈ వేసవిలో విద్యుత్ సరఫరా జరిగిందని డిప్యూటీ సీఎం వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ సీఎం డి సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


# సినీసిటీగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలి



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: సినీ రంగానికి హైదరాబాద్ నగరాన్ని రాజధానిగా, సినీసిటీగా మార్చేందుకు అవసరమైన డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం, మంత్రుల సబ్ కమిటీ చైర్మెన్ మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఈనెల 14న తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డ్స్ ఫంక్షన్‌ను అంగరంగ వైభవంగా నిర్వహించాలని సూచించారు. సమావేశానికి దేశంలోని ప్రముఖ సినీనటులను ఆహ్వానించాల న్నారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రుల సబ్‌కమిటీ సభ్యులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబులతో పాటు సమాచార శాఖ కమిషనర్, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులతో డిప్యూటీ సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను సినిమా సిటీగా అభివృద్ధి చేసి, దేశ, విదేశాల నుంచి సినిమా రంగ ప్రముఖులను ఆకర్షించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో సినిమా షూటింగ్ చేయా లంటే పోలీసు శాఖ, అగ్నిమాపక శాఖ, మున్సిపల్ శాఖ వంటి వివిధ శాఖల నుంచి విడివిడిగా అనుమతులు తీసుకోవాల్సి వస్తుండటంతో సినిమా నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో ఒక అధికారిని నియమించి వారి ద్వారా అన్ని శాఖల అనుమతులు త్వరితగతిన ఇప్పించేలా సింగిల్ విండో పద్ధతిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని పర్యాటక ప్రాంతా ల్లో షూటింగ్‌లు చేసేలా చర్యలు తీసుకుంటే పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. థియేటర్లలో క్యాంటీన్ల ద్వారా తినుబండాలు, ఇతర వస్తువులు అత్యధిక రేట్లకు విక్రయించడంవల్ల సామాన్యులు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారన్నారు. ధరలను నియం త్రించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు గతంలో రాష్ట్ర ప్రభుత్వం 50 ఎకరాలు మంజూరు చేసిందనీ, ప్రస్తుతం ఆ భూమి పరిస్థితి, పూర్తి వివరాలను వచ్చే సమావేశం నాటికి అందజే యాలని ఆదేశించారు. సినీ కార్మికుల కోసం నిర్మించిన చిత్రపురి కాలనీపై ఏర్పాటుచేసిన ఆర్‌సీఎస్ కమిటీనీ వచ్చే సమావేశానికి పిలిపిం చాలని సూచించారు. సమావేశంలో ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ దిల్ రాజు, హొం శాఖ స్పెషల్ సీఎస్ రవిగుప్తా, సమాచార శాఖ కమిషనర్ హరీష్, ఎఫ్‌డీసీ డైరెక్టర్ కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# హరీశ్‌రావుపై ఎన్నికల పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: సిద్దిపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత టి.హరీశ్‌రావు ఎన్నికను సవాల్ చేస్తూ కాంగ్రెస్ నేత జి.చక్రధర్‌గౌడ్ వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ఆరోపణలకు సరైన ఆధారాలు చూపలేదని పేర్కొంది. జస్టిస్ కాజా శరత్ ఈ పిటిషన్‌పై విచారణ పూర్తి చేసి మంగళవారం తీర్పు వెల్లడించారు. గతేడాది జనవరి 10న బీఎస్పీ నుంచి పోటీ చేసిన చక్రధర్ గౌడ్(ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్నారు) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల అధికారులకు వినతి పత్రం మాత్రం సెప్టెంబరు 30న సమర్పించారు. ఈపీ వేశాకే ఈసీకి ఫిర్యాదు చేయడాన్ని జస్టిస్ తప్పుపట్టారు. ఈసీకి అందజేసిన వినతిపత్రం ప్రతిని హైకోర్టుకు ఇవ్వలేదని పేర్కొన్నారు. పోలింగ్ జరిగిన రోజు సాయంత్రం 4 గంటలకు 45 శాతమే పోలింగ్ ఉంటే దానిని హరీష్ తన అనుచరుల ద్వారా 85 శాతం పెరిగేలా చేశారనే ఆరోపణలకు ఆధారాలైన గంటలవారీ పోలింగ్ వివరాలు సమర్పించలేదన్నారు. మిట్టపల్లి రెవిన్యూ గ్రామంలో సర్వే నెం 1037లోని వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా చూపి తప్పుదారి పట్టించారంటూ ధరణి పోర్టల్లోని వివరాలక్కు ధ్రువీకరణ లేకుండా ఆరోపణ చేశారన్నారు. సర్వే నెం 1037లో 1431 చదరపు గజాలు. 520 చదరపు గజాలు వేర్వేరుగా కొనుగోలు చేసినట్లు డాక్యుమెంట్లను హరీశ్ ఇచ్చారని తెలిపారు. క్రిమినల్ కేసుల వివరాలను హరీశ్ ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారనీ, కేసులతోపాటు శిక్ష పడిన కేసుల వివరాలను కూడా ఇచ్చారని తెలిపారు. పిటిషనర్ ఆరోపణలకు ఆధారాలను సమర్పించలేదని తీర్పు చెప్పారు.



గోపీనాథ్‌పై ఎన్నికల పిటిషన్ మూసివేత

జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఎన్నికను సవాలు చేస్తూ దాఖలైన రెండు ఎన్నికల పిటిషన్లపై హైకోర్టు విచారణ మూసివేసింది. ఈవీఎంలో అవకతవకలు జరిగినందున మాగంటి గోపీనాథ్ ఎన్నికను రద్దు చేయాలంటూ కాంగ్రెస్ అభ్యర్థి అజారుద్దీన్, ఓటరు వి.నవీనీయాదవ్ వేసిన పిటిషన్లను కొట్టేస్తూ మంగళవారం జస్టిస్ కె.లక్ష్మణ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల మాగంటి మరణించడంతో పిటిషన్లపై విచారణ అవసరం లేదన్నారు

జస్టిస్ గిరిజా ప్రియదర్శినికి నివాళులు

అనారోగ్యంతో ఇటీవల మరణించిన హెకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాటూరి గిరిజా ప్రియదర్శినికి హైకోర్టు మంగళవారం నివాళి అర్పించింది. యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజరు పాల్ అధ్యక్షతన ఫస్ట్ కోర్టు హాల్లో సంతాప సమావేశం జరిగింది. మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.కార్యక్రమంలో జస్టిస్ గిరిజా ప్రియదర్శిని కుటుంబ సభ్యులతోపాటు, ఏజీ సుదర ్మన్‌రెడ్డి, బార్ కౌన్సిల్ చైర్మెన్ ఎ.నరసింహారెడ్డి, అదనపు సొలిసిటర్ జనరల్ నరసింహ శర్మ. డిప్యూటీ సొలిసిటర్ జనరల్ జి.ప్రవీణ్ కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్ హాజరయ్యారు. బార్ అసోసియేషన్ కూడా సంతాప సమావేశం నిర్వహించింది.

గాలికి శిక్ష సస్పెన్షన్‌పై నేడు ఉత్తర్వులు

ఓబులాపురం అక్రమ మైనింగ్ కేసు(ఓఎంసీ)లో సీబీఐ కోర్టు విధించిన శిక్షను సస్పెండ్ చేయాలని కోరుతూ గాలి జనార్ధన్‌రెడ్డి (కర్నాటక ఎమ్మెల్యే) దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్‌పై బుధవారం తీర్పు వెలువరిస్తామని హైకోర్టు ప్రకటించింది. మంగళవారం ఇరుపక్షాల వాదనలు పూర్తి కావడంతో తీర్పును రిజర్వు చేస్తున్నట్టు వెల్లడించింది. ఓఎంసీ కేసులో గాలి జనార్ధన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వీడీ రాజగోపాల్, అలీఖాన్ దోషులని తేల్చుతూ సీబీఐ కోర్టు గత నెల ఆరోతేదీన ఏడేండ్ల జైలుశిక్ష విధించింది. ఈ తీర్పును వారితోపాటు ఓఎంసీ కంపెనీ కూడా సవాల్ చేస్తూ హైకోర్టులో అప్పీళ్లను దాఖలు చేశారు. శిక్ష అమలు జరిగితే తనపై కర్నాటక అసెంబ్లీ స్పీకర్ అనర్హత వేటు వేశారనీ, నియోజకవర్గానికి ఉప ఎన్నిక నోటిఫికేషన్‌కు ఆస్కారం ఉంటుందని గాలి జనార్ధన్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఓఎంసీ డైరెక్టర్లు ఇద్దరూ జైలులో ఉంటే కంపెనీ మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఓఎంసీ దాఖలు చేసిన అప్లికేషన్‌లో పేర్కొంది. వీటిపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ మంగళవారం పూర్తి చేశారు. ఐఏలపై బుధవారం ఉత్తర్వులు వెలువరిస్తామని ప్రకటించారు. ఇదే కేసులో ప్రధాన పిటిషన్ విచారణ ఆగస్టు 11కు, మరికొన్ని అప్లికేషన్లపై విచారణ ఈ నెల 17కు వాయిదా వేశారు.

# అర్హులకు సర్టిఫికెట్ ఇవ్వకపోతే అన్యాయం చేసినట్టే




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: అర్హులైన వికలాంగులకు సదరం సర్టిఫికెట్ ఇవ్వకపోతే వారికి తీవ్ర అన్యాయం చేసినట్టే అవుతుందనీ, డాక్టర్లు మానవీయత జోడించి వైకల్య పరీక్షలు నిర్వహించాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) సూచించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య తీరుతో చాలా మంది వికలాంగులు పథకాలకు దూరంగా ఉంటున్న విషయాన్ని ఎత్తిచూపారు. మంగళ వారం హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో సదరం ధ్రువీకరణ పత్రాలిచ్చే డాక్టర్ల వర్క్‌షాపు నిర్వహించారు. అందులో మంత్రితోపాటు సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్, సదరం డైరెక్టర్ సాయి కిషోర్, న్యూ ఢిల్లీ ఎయిమ్స్, గాంధీ, ఉస్మానియా, నిమ్స్ ఆస్పత్రుల పలు విభాగాధిపతులు, ఆయా విభాగాల స్పెషలిస్టులు, డాక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గతానుభవాల దృష్ట్యా రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి సదరం డాక్టర్లకు వర్క్‌షాపు నిర్వహిస్తున్నామ న్నారు. ఎలాంటి వైకల్యముంది? ఎంత శాత ముంది? అనే అంశాన్ని డాక్టర్లు పక్కాగా గుర్తించి సదరం ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని సూచించారు. రాష్ట్రంలో సదరం ధ్రువీకరణ పత్రాలు జారీచేసే 38 ఆస్పత్రులకు రూ.3.8 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. చేయూత పెన్షన్, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం ద్వారా స్వయం ఉపాధి పథకాలకు సదరం సర్టిఫికెట్ కీలకమని నొక్కిచెప్పారు. అందుకే డాక్టర్లు మానవ తను జోడించి వైకల్య పరీక్షలు నిర్వహించాలని కోరారు. అర్హులెవ్వరూ నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకుని 21 రకాల వైకల్య ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని సూచించారు. వైకల్యాన్ని సరిగా జడ్జిమెంట్ చేసేందుకు అనుభవజ్ఞులైన డాక్టర్లతో శిక్షణ ఇప్పిస్తున్నామని చెప్పారు. వికలాంగుల పరికరాల కోసం ఏటా రూ. 50 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఈ వర్క్‌షాపులో 200మందికిపైగా డాక్టర్లు పాల్గొన్నారు.


# ఎమ్మెల్సీ కవిత అరెస్ట్..




హైదరాబాద్: అమృత్ తెలంగాణ: విద్యార్థులు, జనరల్ బస్‌పాస్‌ల చార్జీలను తాజాగా తెలంగాణ ఆర్టీసీ పెంచిన దాదాపు దాదాపు 20 శాతం విషయం తెలిసిందే. దీంతో ప్రజలు, విద్యార్థులు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే భవన్ వద్ద ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో బస్ పాస్ ధరల పెంపునకు నిరసనగా ఇవాళ బస్ భవన్ ముట్టడికి యత్నించారు. పెద్ద ఎత్తున జాగృతి కార్యకర్తలతో కలిసి బస్ భవన్ ఎదుట ఎమ్మెల్సీ కవిత బైటాయించారు. ఈ క్రమంలోనే ఘర్షణ వాతావరణం ఏర్పడటంతో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడుతూ.. వెంటనే ఆర్టీసీ పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బస్‌పాస్ ధరలను పెంచి ప్రజలపై ప్రభుత్వం పెనుభారాన్ని మోపిందని మండిపడ్డారు. విద్యార్థులు, చిరుద్యోగులపై తీవ్రంగా ఆర్థిక భారం పడుతుందని, బస్‌పాస్ ధరలను పెంచి ప్రజలపై గుదిబండను మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పెంపుతో ఒక్క ప్రయాణికుడిపై నెలకు దాదాపు రూ. 300 పైగా భారం పడుతుందని అంచనా వేశారు. మరోవైపు అనేక రూట్లలో విద్యార్థుల కోసం బస్సులు నడపడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయని, ప్రజలను దోచుకోవడానికి ప్రభుత్వం అలవాటు పడిందన్నారు. ఎమ్మెల్సీ కవితను తొలుత చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్‌కు పోలీసులు తరలించారు. ఇప్పుడు కంచన్ బాగ్ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఇంతకు ఏ పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నారో స్పష్టంగా చెప్పడం లేదని పోలీసులపై తెలంగాణ జాగృతి కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# క్యాబినెట్ కూర్పుపై కసరత్తు

న్యూఢిల్లీ : అమృత్ తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ కూర్పుపై హస్తినలో రెండో రోజూ కసరత్తు కొనసాగినట్టు తెలిసింది. కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. కొత్తగా మంత్రివర్గంలోకి వచ్చిన ముగ్గురికి మంత్రిత్వ శాఖ కేటాయింపుతో పాటు, పాత మంత్రుల శాఖల్లో భారీగా మార్పు లు చేర్పులు చేయాలని నిర్ణయించినట్టు ప్రాథమిక సమాచారం. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో మంత్రిత్వ శాఖల కేటాయింపుపై కీలక సమావేశం జరిగింది. దాదాపు గంటకుపైగా జరిగిన ఈ సమావేశంలో సామాజిక న్యాయం ఆధారంగా మంత్రిత్వ శాఖలను కేటాయించాలని అగ్రనేత రాహుల్ సూచించినట్టు తెలిసింది. ఈ దిశలో ప్రస్తుతం సీఎం, మంత్రుల వద్ద ఉన్న శాఖల వివరాలను అడిగి తెలుసుకున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుతం మంత్రిత్వ శాఖల జాబితాను అగ్రనేతలకు అందజేయడంతో పాటు, ఏడాదిన్నరగా ఆ శాఖల పనితీరును వివరించినట్టు తెలిసింది. అలాగే కొత్తగా మంత్రివర్గం లోకి వచ్చిన వారికి ఏయే శాఖలు కేటాయిస్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కాగా పలువురు మంత్రులు ప్రస్తుతం తమ వద్ద ఉన్న శాఖలతో సంతృప్తిగా లేరనే అంశంపై చర్చ జరిగినట్టు తెలిసింది. మరోవైపు ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నా పలు శాఖల వారీగా వైఫల్యంపై ఆరా తీసినట్టు తెలిసింది. అలాగే కొందరు మంత్రులు తమ శాఖలు మార్చాలని అధిష్టానాన్ని కోరుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఢిల్లీ పర్యటనల్లో పలుమార్లు ఈ విషయాన్ని ఆయా మంత్రులు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. ఈ అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని ఆయా శాఖల ఆధారంగా చేపట్టాల్సిన మార్పులపై చర్చించారు.



# వరద నీటితో వచ్చే సమస్యల పై ముందస్తు చర్యలు తీసుకోండి.

## కుబీర్ మండల ఎంపీడీవో,కు వినతి పత్రం అందజేసిన ఎస్ జె డబ్ల్యూ హెచ్ఆర్సీ ప్రతినిధి డాక్టర్ సప పండరి,




వరద నీరు రోడ్డుపైకి, విఠలేశ్వర మందిర ప్రాంగణంలోకి వచ్చిన దృశ్యాన్ని చూపిస్తున్న SJWHRC ప్రతినిధి సాప పండరి



శిల్పకళా దామం వద్ద ఇండ్లలోకి వరద నీరు రావడంతో రోదిస్తున్న మహిళలు



ఎంపీడీవోకు వినతి పత్రం అందజేసిన దృశ్యం

నిర్మల్ జిల్లా కుబీర్ జూన్ 10 అమృత్ తెలంగాణ కుబీర్ మండల కేంద్రంలో సోమవారం రాత్రి 10 గంటలకు కురిసిన ఒక గంట వర్షానికే,మురికి కాలువలు శుభ్రంగా లేకపోవడంతో రోడ్డుపైకి మురికి నీరు వచ్చాయని, అలాగే విట్టలేశ్వర మందిర ప్రాంగణంలోకి,గ్రామంలోని శిల్పా కళాధామం వద్ద మురికి కాలువ చెత్తాచెదారంతో నిండుక పోవడంతో, ఇండ్లలోకి వరద నీరు వచ్చాయని మహిళలు వాపోతున్నట్టు,వర్షాకాల ప్రారంభంలోనే ఇలా ఉంటే, తర్వాత వరద నీటి తీవ్రత ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలని సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉత్తర తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ సాప పండరి కుబీర్ మండల ఎంపీడీవో గంగాసాగర్ రెడ్డికి, ఎంపీపీ గంగా మోహన్కు వివరించగా,అధికారులు తక్షణమే మురికి కాలువలను శుభ్రపరుస్తామని,ఇకపై వీటి సమస్య ఉండకుండా చూస్తామని హామీ ఇచ్చినట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా చంపతి, వడ్నప్ లక్ష్మణ్, మహిళలు, గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు

# 'సంవిధాన్ బచావో ప్రోగ్రామ్' రాష్ట్ర కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆత్రం సుగుణక్క





అమృత్ తెలంగాణ హైదరాబాద్ బ్యూరో న్యూస్ : హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ 'సంవిధాన్ బచావో ప్రోగ్రామ్' రాష్ట్ర కమిటీ చైర్మన్ పి.వినయ్ కుమార్ అధ్యక్షతన మంగళవారం హైదరాబాద్ లోని గాంధీ భవన్ లో సమావేశాన్ని నిర్వహించారు...ఈ సమావేశంలో పలువురు సభ్యులతో పాటు, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్,'సంవిధాన్ బచావో ప్రోగ్రామ్' రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఆత్రం సుగుణక్క పాల్గొన్నారు.కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో దేశవ్యాప్తంగా చేపడుతున్న 'సంవిధాన్ బచావో ప్రోగ్రామ్' ని ప్రజల్లోకి ఎలా తీసుకు వెళ్ళాలి,తదితర విషయాలపై సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు.ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగం పరిరక్షణ కోసం 'జై బాపు', 'జై భీమ్', 'జై సంవిధాన్ అభియాన్' కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని తీర్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చైర్మెన్ వినయ్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా 'సంవిధాన్ బచావో ప్రోగ్రామ్' కమిటీలను వేశారని తెలిపారు.అంబేద్కర్ ఆశయాలను, మహాత్మాగాంధీ వారసత్వాన్ని కొనసాగిస్తామని తెలిపారు

## జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ :ఆదిలాబాద్ రిమ్స్ ఆవరణలో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ ఆస్పత్రిని మంగళవారం డైరెక్టర్ జైసింగ్ తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. రూ: 23 కోట్ల కేంద్రం నిధుల వ్యయంతో ఆస్పత్రిని నిర్మించడం జరిగిందని.. నిర్మాణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. కార్పొరేట్ కు దీటుగా ఆసుపత్రిని నిర్మించడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లాకు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, క్రిటికల్ కేర్ ఆస్పత్రి అందించిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ దానికి సహకరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో క్రిటికల్ క్లియర్ ఆస్పత్రి ప్రారంభించడానికి కేంద్ర, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రులతో పాటు జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క ను ఆహ్వానిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా నాయకులు ఆకుల ప్రవీణ్ కృష్ణ యాదవ్ భరత్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు

## కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

అశ్వారావుపేట :అమృత్ తెలంగాణ: ఈ నెల 3 వ తేది ప్రారంభం అయిన రెవెన్యూ సదస్సులు కొనసాగుతూనే ఉన్నాయి.10వ తేదీమంగళవారం దురద పాడు,నారాయణపురం రెవిన్యూ గ్రామంలోని దిబ్బగూడెం,మొద్దులు మడ, మల్లాయిగూడెం పంచాయితీల్లో గల గాద్రాల,దిబ్బ గూడెం,పండువారిగూడెం, కొండతోగు ఆవాస గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రామక్రిష్ణ మాట్లాడుతూ ఇప్పటి వరకు 10 రెవెన్యూ గ్రామాల్లో 13 పంచాయితీల్లో ని 27ఆవాస గ్రామాల్లో రెవిన్యూ సదస్సులు నిర్వహించామని తెలిపారు.

## ఆదిలాబాద్ ఇందిరా ప్రియదర్శిని మైదానంలో జరుగుతున్నరాష్ట్ర స్థాయి హాకీ సబ్ జూనియర్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది.



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : ఆదిలాబాద్ ఇందిరా ప్రియదర్శిని మైదానంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి హాకీ సబ్ జూనియర్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. టోర్నమెంట్ లో ఉమ్మడి జిల్లాల జట్లు పాల్గొనగా.... క్రీడాకారులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. టోర్నమెంట్ విజేతగా హైదరాబాద్ జట్టు నిలిచింది. నిజామాబాద్, నల్గొండ రెండు, మూడవ స్థానాలను సాధించాయి. టోర్నమెంట్ ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రధానం చేసి అభినందించారు. రాష్ట్ర క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.జిల్లాలో రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ ను విజయవంతంగా పూర్తి చేయడం పట్ల నిర్వాహకులకు అభినందనలు తెలియచేశారు. తెలంగాణా హాకీ అసోసియేషన్ అధ్యక్షులు విజయ్ కుమార్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బాలూరి గోవర్ధన్ రెడ్డి, గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, యూనుస్ అక్బని రాష్ట్రపాల్ తో పాటు పలువురు క్రీడాకారులు, కోచ్ లు పాల్గొన్నారు.

# కస్తూర్బా బాలికల విద్యాలయం దరఖాస్తుల ఆహ్వానం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : అదిలాబాద్ జిల్లాలోని గాదిగూడ మండలం లో కేజీబీవీ లో ఖాళీగా ఉన్న PGCRTఉద్యోగులకు అతిథి అధ్యాపకులుగా పనిచేయుటకు సంబంధించిన సబ్జెక్టులో ఇంగ్లీష్ ఫిజిక్స్ కెమిస్ట్రీ బాటని జువాలజీ పీజీ మరియు బి.ఎడ్ అర్హత కలిగిన మహిళ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేక అధికారి రాథోడ్ సరస్వతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ అభ్యర్థులు ప్రస్తుత విద్యా సంవత్సరం విధులు నిర్వహించవలసి ఉంటుందని తెలిపారు

దరఖాస్తు లను 12/06/2025 నుండి16/06/2025 వరకు సాయంత్రం లోపు కస్తూర్బా బాలికల విద్యాలయం గాదిగూడ మండలం లో పాఠశాలలో ఇవ్వగలరని తెలిపారు

# బడిబాటలో భాగంగా చాక్ పల్లి గ్రామంలో పర్యటించిన కల్లూరు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు...

## ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు విన్నపం

నిర్మల్ జిల్లా చాక్పల్లి జూన్ 10 అమృత్ తెలంగాణ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 6 నుండి 12 వరకు చేపట్టిన బడిబాట కార్యక్రమంలో భాగంగా చాక్ పల్లి గ్రామంలో ఉపాధ్యాయులు పర్యటించారు విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల కోసం విశాలమైన భవనాలతో పాటు ఉపాధ్యాయుల నియామకం మధ్యాహ్న భోజనం యూనిఫామ్ ఉచిత పుస్తకాలు తదితర సౌకర్యాలు కల్పిస్తుందని దీనిని వినియోగించుకొని చదువులో రాణించాలని పేర్కొన్నారు బడి మానేసిన వారు ఐదు సంవత్సరాలు పై వయస్సు ఉన్న వారు అడ్మిషన్ తీసుకోవాలని పేర్కొన్నారు ఉపాధ్యాయులు విద్యార్థుల కోసం సకల సౌకర్యాలు కల్పించే విధంగా కృషి చేస్తారని రవాణా సౌకర్యం కూడా కల్పిస్తామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో కల్లూరు జిల్లా పరిషత్ ప్రధాన ఉపాధ్యాయుడు రాజేశ్వర్ ఎంపీపీఎస్ ప్రధాన ఉపాధ్యాయులు చంద్రశేఖర రావు జిల్లా విద్యాశాఖ కార్యాలయం స్పెషల్ అబ్జర్వర్ నర్సయ్య ఉపాధ్యాయులు నవీన్ సుజాత పద్మలత రవీందర్ తిరుమల్ రెడ్డి తో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేష్ కుమార్ సామాజిక కార్యకర్త సయ్యద్ కలీం రాజు గ్రామస్తులు పాల్గొన్నారు




బడిబాట కార్యక్రమంలో చాక్పల్లిలో పర్యటించిన ఉపాధ్యాయులు

# పొచ్చర గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేసిన నలిమెల నవీన్ రెడ్డి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ గ్రామీణ న్యూస్ : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పొచ్చర గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి మంగళవారం అధికారులు శ్రీకారం చుట్టారు. మండల పంచాయతీ అధికారి స్వప్నశీల,పంచాయతీ సెక్రటరీ సంధ్యారాణి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నలిమెల నవీన్ రెడ్డి ఇళ్ల పథకాన్ని ప్రారంభించి లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు.నిరుపేదలకు సొంతింటి కల నెరవేరబోతుందని,ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు నవీన్ రెడ్డి సూచించారు.ఈ కార్యక్రమంలో పోతారెడ్డి, హరీష్ రెడ్డి, అశోక్ రెడ్డి, గంగాధర్, ఎల్ కిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఉచిత శిక్షణకు ధరఖాస్తుల ఆహ్వానం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ బ్యూరో న్యూస్ : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగులైన యువకులకు కేంద్ర ప్రభుత్వ నాబార్డు సంస్థ వృత్తినైపుణ్య శిక్షణలో భాగంగా నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ వారి ఆధ్వర్యములో (న్యాక్) ప్లంబింగ్, పైప్ ఫిట్టర్, ఎలక్ట్రికల్ కోర్సులకు 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగేంద్రం గారు ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనము మరియు వసతి కల్పిస్తు యూనిఫాం, స్టేషనరీ, శిక్షణ సామాగ్రి ఇవ్వబడుతుంది. శిక్షణ అనంతరము సర్టిఫికేట్తో పాటు వివిధ కంపెనీలలో ఉపాధి కల్పించబడును. ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనగలరని తెలిపారు. అభ్యర్థుల వయస్సు 18 సం.రాల నుండి 40 సం.రాలు కలిగి ఉండవలెను. శిక్షణ కొరకు విద్యార్హత సర్టిఫికెట్, కులధృవీకరణ పత్రము, ఆదాయ ధృవీకరణ పత్రము, నివాస ధృవీకరణ పత్రము, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, నాలుగు పాస్పోర్టు సైజు ఫోటోలతో న్యాక్ కార్యాలయము,

ZP ఆఫీస్ వెనుక ఆదిలాబాదు నందు లేదా వాట్సాప్ ద్వారా గాని ఈ నెల 18 తేదిలోగా పేర్లను నమోదు చేసుకోగలరు. వివరాలకు 9154548063, నెంబర్ ను సంప్రదించగలరు. అసిస్టెంట్ డైరెక్టం న్యాక్, ఆదిలాబాద్.

## వర్ష భావ పరిస్థితులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంకున్న పలు గ్రామాలను సందర్శించిన. .మాజీ మంత్రి జోగు రామన్న



వివరాలను అడిగి తెలుసుకుంటున్న జోగు రామన్న

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : జిల్లా వ్యాప్తంగా ఈదురుగాలులతో కూడిన భారి వర్షం కురవడంతో పలు చోట్ల ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇండ్ల పైకప్పులు ఎగిరిపోవడంతో బాధితుల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి జోగురామన్న జైనథ్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఆకుర్ల గ్రామంలో ఈదురుగాలులకు నష్టపోయిన పలు ఇండ్లను పరిశీలించారు. అదేవిధంగా మసీదు షెడ్లు దెబ్బతినడంతో అక్కడి పరిస్థితిని పరిశీలించి స్థానికులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులను పరామర్శించి భరోసా కల్పించారు. వారికి అందే నష్ట పరిహారం విషయాన్నీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెల్తామన్నారు. పరామర్శ అదే విధంగా గ్రామానికి సయ్యద్ ఉమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. సదరు కుటుంబానికి కనీసం రైతుబీమా అందకపోవడం విచారకరమని పేర్కొన్నారు.



పరిశీలిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

# అంబేద్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి

తాడ్వాయి :అమృత్ తెలంగాణ: మండల కేంద్రములోనీ బస్టాండ్ ప్రాంగణం లోజూన్ 12న డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ నాయకులు అన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ .. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజా సంఘాల నాయకులు, దళిత సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, మేధావులు, కవులు, కళాకారులు , మహిళలు, విద్యార్థులు,



ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, పార్టీలకు అతీతంగా ప్రతీ ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# నిర్మల్ పట్టణాన్ని వణికించిన ఈదురు గాలులు మరియు భారీ వర్షాం




అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ నిర్మల్ పట్టణాన్ని వణికించిన ఈదురు గాలులు మరియు భారీ వర్షానికి బ్రహ్మపురి, షేక్సా పేట్ వంటి కాలనీల్లో పెద్దపెద్ద చెట్లు విరిగి రోడ్డు మీద అడ్డంగా పడిపోవడం వలన ఆటోలు లారీలు ఇంకా వేరే వాహనాలు ధ్వంసం అయ్యాయి. ఈ పరిస్థితిని గమనించిన జిల్లా ఎస్పీ శ్రీమతి జి. జానకి షర్మిల (ఐపిఎస్) తక్షణమే స్పందించి, నిర్మల్ జిల్లా ప్రత్యేక మహిళా బృందమైన శివంగి టీమ్ ను రంగంలోకి దింపారు. శివంగి బృందం వెంటనే స్పందించి అక్కడికి చేరుకుని అక్కడున్న పరిస్థితులను చక్క దిద్ది, రోడ్డు కు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి, అక్కడ ఇబ్బంది పడిన వృద్ధులకు, ప్రజలకు సహాయం అందించారు . ఈ సహాయక చర్యల్లో మరియు రోడ్డుకు అడ్డంగా ఉన్న వాటిని తొలగింపు కార్యక్రమం లో నిర్మల్ పట్టణ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఆర్ఐ అడ్మిన్ రామ్ నిరంజన్ రావ్,ఆర్ ఐ శేఖర్, ఆర్ ఎస్సై రాజశేఖర్ లు మరియు 12 మంది శివంగి మహిళా బృందం పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాంను పరిశీలించిన జిల్లా కలెక్టర్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి ఈవీఎంల భద్రతను పర్యవేక్షిస్తూ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం ఉదయం కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదామును రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. గోదాములో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును కలెక్టర్ సమీక్షించారు. భద్రతా పరంగా ఎలాంటి లోపాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీస్ సిబ్బంది తమ విధులను సమర్ధవంతంగా నిర్వర్తించాలని సూచించారు. ఈవీఎంల భద్రత, లాజిస్టిక్ ఏర్పాట్లు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరిపల్లి శ్రావణ్ రెడ్డి, సిరికొండ రమేష్, గంద్రత్ రమేష్, హైదర్, మజర్, ప్రశాంత్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు గజానంద్, ఈడిఎం నదీమ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

# అటవీ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు చర్యలు తీసుకోండి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను చేపట్టేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ, అటవీ, విద్యుత్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మారుమూల గిరిజన, అటవీ ప్రాంతాల్లో రహదారులు, వంతెనలు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పన కోసం శాఖలు అటవీశాఖకు ప్రపోజల్స్ పంపించాలని సూచించారు. అభివృద్ధి పనులకు అటవీశాఖ నుంచి ముందస్తు అనుమతులు పొందాల్సిన అవసరం ఉందని, ప్రతి శాఖ పరస్పర సమన్వయంతో కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు. విద్యుత్ లైన్‌ల ఏర్పాటుకు పరివేష్ పోర్టల్ ద్వారా అనుమతులు పొందాలని అధికారులకు స్పష్టంగా తెలిపారు. చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన మార్గదర్శకాలను ఇతర శాఖలకు అటవీశాఖ వేగంగా పంపించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, జిల్లా అటవీ అధికారి నాగిని భాను, ఆర్డీఓ రత్నాకళ్యాణి, సంబంధిత శాఖల ఇంజినీరింగ్, రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్

# రేషన్ షాపులను ఆకస్మిక తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

మల్హర్ రావు :అమృత్ తెలంగాణ: నిత్యావసర వస్తువుల పంపిణీలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం కాటారం మండలం లోని గారెపల్లి, ధన్వాడ గ్రామాల్లో చౌక ధరల దుకాణాలు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ స్టాక్ పరిశీలించి లబ్ధిదారులతో సంభాషించారు. చౌక ధరల దుకాణాలు సమర్ధవంతంగా పనిచేయాలని లబ్ధిదారులు ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్డులు కలిగిన ప్రతి కుటుంబానికి నిత్యావసర వస్తువుల పంపిణీ జరగాలని ఆయన ఆదేశించారు. లబ్ధిదారులు లేవనెత్తిన ఏవైనా సమస్యలు లేదా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. చౌక దుకాణాల పనితీరును పర్యవేక్షించడం, పిడీఎస్ ప్రయోజనాలు పారదర్శకంగా, సమర్థవంతంగా ఉద్దేశించిన లబ్ధిదారులకు చేరేలా చూడటం కోసం నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనాద్ తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే తోటను పరామర్శించిన గ్రంథాలయ చైర్మన్

మద్నూర్ : అమృత్ తెలంగాణ: ఇటీవలే అనారోగ్యానికి గురై హాస్పిటల్ లో చికిత్స పొంది కోలుకొని విశ్రాంతి తీసుకుంటున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావును తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా. రియాజ్ మంగళవారం హైదరాబాదులోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఎమ్మెల్యే గారి ఆరోగ్యం, క్షేమ, సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ రియాజ్ పరామర్శ కార్యక్రమంలో జుక్కల్ నియోజకవర్గం ముఖ్య నాయకులు ఎమ్మెల్యేకు అత్యంత సన్నితుడైన సాయి పటేల్ ఉన్నారు.



# ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో చర్చలకు మేము సిద్ధం..

తాడ్వాయి :అమృత్ తెలంగాణ: ఇటీవల ప్రభుత్వ మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అక్రమాలు చూపించడానికి మేము బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని మీరు సిద్ధమేనా అని మాజీ జెడ్పిటిసి టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు రామసహాయం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం కాటా పూర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలో మంజూరు ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్లలో పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నటువంటి అంకంపల్లి గ్రామపంచాయతీ, గవర్నర్ దత్తత తీసుకున్న కొండపర్తి మినహా మండలంలో ఏ గ్రామ పంచాయతీలో అర్హులు అయినటువంటి అత్యంత పేదలకు ఇండ్లు ఇవ్వకుండా అనర్హులకు కాంగ్రెస్ కార్యకర్తలకు, భూమి ఉన్న లబ్ధిదారులను ఎంపిక చేసి అక్రమాలను అవినీతిని నిరూపించడానికి బిఆర్ఎస్ పార్టీ గా మేము సిద్ధం?? మీరు సిద్ధమా?? అని ఈ సందర్భంగా మిమ్మల్ని అడుగుతున్నాను మీరు సిద్ధంగా ఉన్నట్టయితే తేదీ సమయం మీరే నిర్ణయించండి. మేము రావడానికి సిద్ధం అన్నారు.మేడారం నుండి అక్రమంగా ఇసుక తరలిస్తూ ఇందిరమ్మ ఇండ్ల కోసమే అని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు.కానీ వాస్తవంగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కాకముందే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పటినుండి ఇసుక అక్రమ తరలింపు వాస్తవం కాదా ఇట్టి విషయంలో అక్రమ తరలింపుకు అడ్డుకున్న ఎమ్మార్వో గిరిబాబును బదిలీ చేసింది వాస్తవం కాదా? ఇది వాస్తవం కాకపోతే మేడారం సమ్మక్క సారలమ్మ గద్దెల మీద ప్రమాణం చేయగలరా లేక పోతే మేము ప్రమాణం చేయడానికి సిద్ధం? అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ ఇందారపు లాలయ్య,మాజీ కోఆప్షన్ మెంబర్ దిలావర్ ఖాన్,మాజీ సర్పంచ్ మేడిశెట్టి నరసింహులు,మాజీ ఎంపిటిసి దానికి నరసింహారావు, మాజీ సర్పంచ్ పుల్లూరు గౌరమ్మ, మాజీ అధ్యక్షులు నూశెట్టి రమేష్,నాలి నాగేశ్వరరావు, నాలి రమేష్, పాయం సమ్మయ్య, బీసీ సెల్ మండల నాయకులు గండుబిక్షపతి, మాజీ ప్రధాన కార్యదర్శి వహీద్, రామిల్ల లాలయ్య, రజాక్ ,అరేంకృష్ణ, మటన్ శోభన్,లంజపల్లి వెంకటేష్ ,లంజాపెల్లి రాంబాబు, గడ్డం వెంకన్న,బందెల తిరుపతి నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# ఫీజుల దోపిడీపై విద్యాసంస్థలతో సమావేశం నిర్వహించాలి




కంఠేశ్వర్ :అమృత్ తెలంగాణ: ఫీజుల దోపిడీపై డిస్టిక్ ఫీ రెగ్యులేషన్ కమిటీ ప్రైవేట్ విద్యాసంస్థలతో సమావేశం నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నగర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు టి. దినేష్ పాల్గొని మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలో సుమారుగా 750 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి కానీ ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వం ఇచ్చిన జీవోలను పట్టించుకోవడంలేదని అన్నారు. అదేవిధంగా విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న తరుణంలో ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడిని అరికట్టాలని దానిపై డిస్ట్రిక్ట్ ఫీ రెగ్యులేషన్ కమిటీ చైర్మన్ గా జిల్లా కలెక్టర్ పర్యవేక్షణ ఉంటుందని అందులో సభ్యులుగా జిల్లా విద్యాశాఖ అధికారి ఉంటారని వెంటనే దృష్టికి రెగ్యులేషన్ కమిటీ ప్రవేటు పాఠశాలలతో సమావేశం నిర్వహించి ఫీజుల దోపిడికి అడ్డుకట్ట వేయాలని అన్నారు. అదేవిధంగా విద్యార్థుల తల్లిదండ్రులతో గవర్నమెంట్ కమిటీని ఏర్పాటు చేసి ఫీజులను పెంచాలి తప్ప అనేక పాఠశాలలో ఈ అంశాన్ని తుంగలో తొక్కి ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగం సేవారంగం తప్ప వ్యాపార రంగం కాదని గుర్తు చేశారు. మరియు డొనేషన్ల పేరుతో క్యాపిటేషన్ పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రుల రక్తాన్ని పీలుస్తున్నారని అన్నారు.

మరియు ప్రభుత్వం సిఫారసు చేసిన పాఠ్యపుస్తకాలనే అమ్మాలని ధరలను అదుపులో ఉంచాలని అన్నారు. లేకపోతే భవిష్యత్తులో ఉద్యమాలను ఉధృతం చేస్తాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు అజాద్, నగర సహాయ కార్యదర్శి అభి, నాయకులు గణేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# శ్రీనుబాబు సేవలను కాంగ్రెస్ గుర్తించడం హర్షణీయం.!

మల్హర్ రావు :అమృత్ తెలంగాణ: రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్ బాబు సోదరుడు శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు సేవలను కాంగ్రెస్ అధిష్టానం గుర్తించి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా దుద్దిళ్ల శ్రీను బాబును నియామించడం పట్ల కాంగ్రెస్ పార్టీ ఎస్సిసెల్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు దండు రమేష్ మంగళవారం ఒకప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో కొన్నేళ్లుగా క్రియాశీలకంగ పనిచేస్తున్నారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ స్వర్గీయ శ్రీ దుద్దిళ్ల శ్రీపాదరావు చిన్న కొడుకుగా,రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోదరుడిగా తండ్రి ఆశయసాధనలో, అన్న అడుగు జాడల్లో నడుస్తూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ అన్నకు వెన్నంటి ఉంటూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో చురుగ్గా పాల్గొంటూ మంచి యూత్ నేత (యూత్ ఐకాన్) గా మంచి పేరు తెచ్చుకున్నారు. నిత్యం వందలాది వివాహాలు, పరామర్శలతో పాటు మంథని నియోజకవర్గ ప్రాంత ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ అన్నా అంటే నేను ఉన్న అనేలా అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఒక్క మంథని నియోజకవర్గంలోనే కాకుండా అనేక నియోజకవర్గాల్లో కూడా అనేక సేవాకార్యక్రమాల్లో పాల్గొంటు యువతలో ఉత్సహం నింపుతూ తండ్రికి తగ్గ తనయుడుగా, అన్నకు తగ్గ తమ్ముడుగా పేరు తెచ్చుకున్నారని తెలిపారు. శ్రీనుబాబు తెలంగాణ ప్రదేశ్ ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధిష్టాన పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.




# భూభారతి చట్టంతోనే సమస్యలు పరిష్కారం.!

మల్హర్ రావు :అమృత్ తెలంగాణ: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తిసుకొచ్చిన భూ భారతి 2025 చట్టంతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తాడిచెర్ల పిఏసిఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దతూ%శీ%డ్ల గ్రామంలో 215, తాడ్వాయిలో 40,మొత్తం 255 దరఖాస్తులు మండల తహసిల్దార్ రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యదితిగా హాజరై పిఏసిఎస్ చైర్మన్ మాట్లాడారు. గతంలో ఉన్న ధరణిలో అనేక లోపాలు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం గుర్తించి ధరణి స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకువచ్చేందుకు మేధావులు, రైతు సంఘాలు, అందరితో చర్చించి గత చట్టంలోని లోపాలను సవరిస్తూ కొత్త చట్టం తీసుకు వచ్చిందన్నారు. లోపభూయిష్టంగా ఉన్న ధరణి వల్ల పట్టాల జారీలో ఏదేని పొరపాటు జరిగితే అప్పీలు చేయడానికి ఆవకాశం లేదని, రైతులు సివిల్ కోర్టు చుట్టూ తిరగాల్సి వచ్చేదని దానివల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరణి స్థానంలో భూ భారతి తెస్తామని చెప్పిన ప్రకారం పటిష్టమైన చట్టాన్ని అమల్లోకి తెచ్చినట్లు తెలిపారు. భూములు కొన్నా, అమ్మినా లైసెన్స్ సర్వేయర్ ద్వారా హద్దులతో మ్యాపు తయారు చేసి పట్టాదారు పాసు పుస్తకాల్లో నమోదు చేస్తారని తద్వారా భూమి గుర్తింపుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. ఏదేని సందర్భంలో తహసీల్దార్ ద్వారా పొరపాటు జరిగితే ఆర్డీఓ, ఆర్డీఓ నుండి కలెక్టర్, కలెక్టర్ నుండి భూ ట్రిబ్యునల్ కు వెళ్ళడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఉచిత న్యాయ సహాయ సేవలు అందించడానికి అవకాశం కల్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



# గాలివానతో కూలీన ఇండ్లు.. పరామర్శ

కంఠేశ్వర్ : అమృత్ తెలంగాణ: నిజామాబాద్ నగరంలో నిన్న రాత్రి గాలివానకు ప్రజలు అనేక అవస్థలు పడ్డారు. ఇందులో భాగంగా బాధిత కుటుంబాలను కాంగ్రెస్ నాయకులు మల్యాల గోవర్ధన్, అభయ హస్తం కాలనీ అధ్యక్షులు ద్యారంగుల కృష్ణ ల ఆధ్వర్యంలో మంగళవారం పరమర్శించారు. అభయ కాలనీలో గాలివానకు అనేక నిరుపేదల ఇండ్లు నేల మట్టం కావడంతో ప్రజలు నిరాశ్రాయులు అయ్యారు, వారిని పరామర్శించి మనోధైర్యం కల్పించారు. గతంలో అభయ హస్తం కాలనీ అభివృద్ధి కోసం మహ్మద్ షబ్బీర్ అలీ 10 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేశారని, అదేవిధంగా ప్రజలందరికీ ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి మోడల్ కాలనీగా మారుస్తామని హామీ ఇచ్చారు, అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని టీపీసీసీఅధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి కి, జిల్లా కలెక్టర్ కి విన్నవించడం జరిగిందని అన్నారు.గాలి వానతో జరిగిన నష్టాన్ని నేతల దృష్టికి తీసుకువెళ్లి, త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యేలాగా కృషి చేస్తామని, కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం ఎల్లవేళలా మీకు అండగా ఉంటుందని, అధైర్య పడవద్దని ప్రజలకు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, నర్సింగ్, ఆకాష్, షేరు, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు..




అశ్వరావుపేట :అమృత్ తెలంగాణ: ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల పర్యవేక్షణలో నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం అశ్వారావుపేట మండలంలో ముగిసింది. మంగళవారం మండలంలోని కావడిగుండ్ల,ఖమ్మంపాడు రెవిన్యూ గ్రామాల లో నిర్వహించారు. కావడి గుండ్లలో నిర్వహించిన కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ శిరీష,డాక్టర్ జంబమ్మ లు పాల్గొన్నారు. రైతులను ఉద్దేశిస్తూ డాక్టర్ జంబమ్మ మాట్లాడుతూ సూచించిన పంటలలో సూక్ష్మ నీటి పారుదల,బిందు సేద్యం పాటించి రైతు సోదరులు పంట సాగులో నీటి ఆదా ను పాటించాలని తెలియజేశారు. రైతు సోదరులు వానాకాలంలో సాగు చేసే పంటలలో సుస్థిర వ్యవసాయం చేయవచ్చని తెలిపారు.భూసార పరీక్ష అను సారంగా ఎరువు యాజమాన్యం చేపట్టాలని తెలియజేశారు. అనంతరం డాక్టర్ శిరీష మాట్లాడుతూ సిఫారసు చేసిన మేరకు యూరియా ని వాడటం వల్ల ఖర్చు తగ్గించడమే కాకుండా నేలలోని సూక్ష్మజీవులను రక్షించు కోవచ్చుని,తద్వారా వాతావరణంలో ని నత్రజని స్థిరీకరించే అవకాశం ఉ ందని తెలిపారు.రైతు సోదరులు పచ్చిరొట్ట పైర్లు ను సాగు చేసి పంటల్లో కలియ దున్ని సేంద్రీయ కర్బనం శాతం పెంచాలని తెలిపారు. వ్యవసాయ అధికారి శివరాం ప్రసాద్ మాట్లాడుతూ రైతులు వానాకాలం పంట సాగుకు అవసరమయ్యే విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రసీదులు భద్రపరచుకోవాలని తెలియజేశారు.వ్యవసాయ శాఖ నుండి రాయితీల గురించి వివరించారు. ఉద్యాన విస్తరణ అధికారి ఈశ్వర్ మాట్లాడుతూ ఉద్యాన శాఖ నుండి లభ్యమయ్యే రాయితీల గురించి వివరించారు. ముఖ్యంగా బిందు సేద్యం, పండ్ల సాగుకు సంబంధించిన రాయితీల గురించి చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా మాజీ సర్పంచ్ శ్రీమతి భూ లక్ష్మి రైతులందరూ శాస్త్రవేత్తలు చెప్పినటువంటి ముఖ్యమైన సూచనలను పాటించి రాబోయే వాన కాలంలో పంట సవ్యంగా చేసుకోవాలని కోరారు. గ్రామపంచాయతీ సెక్రటరీ మోతిలాల్ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

ఖమ్మంపాడులో ఖమ్మంపాడు లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ కే.నాగాంజలి,డాక్టర్ పి.ఝాన్సీ రాణి లు పాల్గొన్నారు. నాగాంజలి మాట్లాడుతూ పంటల సేద్యంలో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని,తద్వారా భూసారం పెరుగుతుందని వివరించారు.అధిక రసాయనిక ఎరువుల వాడకం ద్వారా భూసారం తగ్గిపోతుందని హెచ్చరించారు.ప్రతి ఏడాది పంట మార్పిడి చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు . అలాగే పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యత,చెట్లను పెంచడం, పర్యావరణం కాపాడటం, నీటిని ఆదా చేసే పద్ధతులు గురించి రైతులకు వివరించారు.డాక్టర్ పి.ఝాన్సీ రాణి మాట్లాడుతూ నేల సారాన్ని పెంచడంలో అపరాల ప్రాముఖ్యత వివరించారు. అపరాల సాగు, రకాలు మరియు పురుగుల తెగుళ్ళ నివారణ గురించి వివరించారు. గ్రామంలో పంటల వైవిద్యం చూపించినందుకు రైతులను అభినందించారు.అలాగే ఇంకుడు గుంతలు,ఫామ్ పాండ్ ప్రాముఖ్యత తెలియజేశారు.వ్యవసాయ విస్తరణ అధికారి షకీరా భాను ఫార్మర్ రిజిస్ట్రేషన్ పద్ధతి గురించి మరియు వివిధ రకాలైన డిపార్ట్మెంట్ స్కీమ్స్ గురించి వివరించారు,సబ్సిడీ ద్వారా మినుము విత్తనం సరఫరా చేయబడుతుంది అని తెలిపారు.మునగా,వెదురు, టేకు సేద్యం వైపు రైతులు దృష్టి సారించాలని ఆమె సూచించారు.తద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి ఏ.సతీష్ గవర్నమెంట్ స్కీమ్స్ అయినటువంటి బోర్ బావులు తవ్వకాలు గురించి తెలిపారు.ఈ కార్యక్రమంలో భారీ ఎత్తులో ఖమ్మంపాడు మరియు కోయ రంగాపురం రైతులు, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు అశోక్,అలేఖ్య, శేఖర్,శివ,అమూల్య,పూజిత రాహుల్, అనిల్ , పంచాయితీ సెక్రటరీ పాల్గొన్నారు.

# వ్యవసాయ కళాశాలలో మెగా జాబ్ మేళా..




అశ్వారావుపేట : అమృత్ తెలంగాణ: స్థానిక వ్యవసాయ కళాశాలలో వి.వి.సి ట్రాక్టర్స్ కంపెనీ ఆద్వర్యంలో మంగళవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. కళాశాల ప్లేస్ మెంట్ సెల్ ఇంచార్జి డాక్టర్ ఆర్.రమేష్ సమన్వయం లో నిర్వహించిన ఈ మెగా జాబ్ మేళా లో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంత కుమార్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి, వచ్చిన ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మంచి ఉద్యోగ అవకాశాలు పొందాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా వివిసి గ్రూప్ సీఈవో పుట్ట శ్రీనివాస్ మాట్లాడుతూ వి వి సి గ్రూప్ యొక్క ప్రాముఖ్యతను అందులో ఉండే ఉద్యోగావకాశాలు గురించి ఫైనల్ ఇయర్ బీఎస్సీ చదువుతున్న విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ ఉద్యోగ అవకాశం కోసం దాదాపు 20 మంది విద్యార్థులు ముఖాముఖీ ల (ఇంటర్వ్యూ) కి హాజరు అయ్యారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఆర్ విభాగం అశోక్,మాధవి,స్పేర్ మేనేజర్ సతీష్ పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ డివిజన్లలో నిర్మాణ మార్పులు చేర్పులు చేపట్టాలి

అశ్వారావుపేట : అమృత్ తెలంగాణ: అశ్వారావుపేట మున్సిపాల్టీలో నూతనంగా ఏర్పాటు చేసిన డివిజన్లు నిర్మాణంలో ఉన్న తప్పుల తడకలును సరి చేయాలని, భవిష్యత్తులో ప్రజల అభ్యంతరాలు లేకుండా మార్పులు చేయాలని మంగళవారం మున్సిపాల్టీ అధికారి సందీప్ కు వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా జిల్లా అధికారిక ప్రతినిధి యూ.ఎస్ ప్రకాశ్ మాట్లాడుతూ.. ప్రధానంగా పేరాయ గూడెం పంచాయతీ మున్సిపాలిటీగా ఏర్పడి అశ్వారావుపేటలో కలిసింది అని అక్కడ ఏర్పడిన డివిజన్లలో నిర్మాణం గందరగోళం ఉందని తెలిపారు.



మున్సిపాలిటీ వ్యాప్తంగా ఎక్కడ ఏ అవకతవకలు ఉన్న సరిచేసి ఎటువంటి ఇబ్బందులు లేకుండా మున్సిపాలిటీ నిర్మాణాన్ని నెలకొల్పాలని, అలాగే పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని వినతి పత్రంలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ టౌన్ అధ్యక్షులు సత్యవరపు సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ లో యువకుడి దారుణ హత్య

కంఠేశ్వర్:అమృత్ తెలంగాణ: నగర శివారులోని హైదరాబాద్ రోడ్ లో గల పాంగ్రా వద్ద యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. సుమారు 30 సంవత్సరాల వయస్సు గల యువకుడిని గుర్తు తెలియని వ్యక్తులు ముఖంపై బలమైన ఆయుధంతో కొట్టి హత్య చేసినట్టు ఆనవాళ్లు ఉన్నాయి. ఉదయం స్థానికులు ఇచ్చిన సమాచారంతో నగర పోలీసులు అక్కడ చేరుకొని దర్యాప్తు చేపట్టారు. యువకుడి వివరాలు తెలిస్తే గాని హత్యకు గల కారణాలు తెలిసే అవకాశం లేదని పోలీసులు తెలిపారు. ఘటన స్థలాన్ని నిజామాబాద్ నగర సీఐ శ్రీనివాసరాజు, 4వ టౌన్ ఎస్ఐ శ్రీకాంత్ లు పరిశీలించారు. స్థానికంగా ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. పాంగ్ర వద్ద గల కల్లుబట్టిలో సోమవారం రాత్రి ఏమైనా గొడవ జరిగి ఉంటుందా అని ఆరా తీస్తున్నారు. రాత్రి వేళల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఒక వ్యక్తిని హత్య చేసి ఉంటారని ఎస్ఎస్ శ్రీకాంత్ భావిస్తున్నారు. మృతుడి కుడి చేతిలో పులి బొమ్మ పచ్చబొట్టు ఉంది. కావున ఫోటోలోని వ్యక్తిని పచ్చబొట్టును గుర్తిస్తే సంబంధిత నాలుగవ పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్ లకు 8712659840, 8712659719,8712659836 సమాచారం అందించాలన్నారు.

# తమన్నా తళుకు బెళుకులు.. చూస్తూ ఉండిపోవాల్సిందే..!



మిల్కీ బ్యూటీ తమన్నా బాలీవుడ్ మూవీ చంద్ స రోషన్ చెహ్రా సినిమాతో తెరంగేట్రం చేయగా శ్రీ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఆ తర్వాత రెండేళ్లు తమిళ సినిమాల్లో నటిస్తూ వచ్చిన అమ్మడు మళ్లీ హ్యాపీడేస్ తో తెలుగులో నటించింది. హ్యాపీడేస్ సూపర్ హిట్ అవడంతో తమన్నాకి టాలీవుడ్ లో సూపర్ క్రేజ్ ఏర్పడింది. ఇక అక్కడ నుంచి ముందు యువ హీరోలతో నటించి ఆ తర్వాత స్టార్ ఛాన్సులు అందుకుంది అమ్మడు. సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చి దాదాపు 20 ఏళ్ల కావొస్తున్నా ఇప్పటికీ యువ హీరోయిన్స్ కి పోటీ ఇస్తూ వరుస సినిమాలు చేస్తుంది తమన్నా. కేవలం హీరోయిన్ గానే కాదు అమ్మడు స్పెషల్ సాంగ్స్ కి కేరాఫ్ అడ్రస్ గా మారింది. హీరోయిన్స్ లో కొద్దోగొప్పో డ్యాన్స్ చేస్తూ అలరించే తమన్నాతో జోడీ కట్టేందుకు స్టార్స్ కూడా ఆసక్తి చూపించారు. స్టార్ హీరోలతోనే కాదు సీనియర్ స్టార్స్ తో కూడా తమన్నా జత కట్టింది. చిరంజీవి నాగార్జున వంటి స్టార్స్ తో కూడా తమన్నా నటించింది. ఇప్పటికీ ఓ పక్క సీనియర్ ఫస్ట్ బెస్ట్ ఆప్షన్ గా తమన్నా తన సత్తా చాటుతుంది. మరోపక్క యువ హీరోలతో కూడా కలిసి చేసేందుకు ఇంట్రెస్ట్ చూపిస్తుంది. తెలుగుతో పాటుగా తమిళ హిందీ పరిశ్రమల్లో కూడా తమన్నా సూపర్ క్రేజ్ తెచ్చుకుంది.

# అతని ప్రవర్తనతో చాలా భయపడ్డా!

ప్రతీ ఇండస్ట్రీలో హీరోయిన్లకు కొన్ని నియమాలుంటాయని, అవి అన్ని చోట్లా ఒకేలా ఉండవని ప్రముఖ నటి మాళవికా మోహనన్ తెలిపింది. ప్రతీ ఇండస్ట్రీలో హీరోయిన్లకు కొన్ని నియమాలుంటాయని, అవి అన్ని చోట్లా ఒకేలా ఉండవని ప్రముఖ నటి మాళవికా మోహనన్ తెలిపింది. సౌత్ లో కనిపించాలంటే హీరోయిన్ మరీ సన్నగా ఉండకూడదని, అలా ఉంటే తప్పని శరీరాకృతి విషయంలో తాను ఎన్నో ఛాలెంజెస్ ఎదుర్కొన్నట్టు మాళవికా తెలిపింది. ఒకప్పుడు తనపై ఎన్నో విమర్శలు వచ్చాయని మాళవిక వెల్లడించింది. గతంలో తనపై వచ్చిన విమర్శలు తనను ఎంతగానో బాధించాయని చెప్తూ తనకు ఎదురైన ఓ చేదు అనుభవాన్ని మాళవిక బయటపెట్టింది. ఒకరోజు రాత్రి తాను ఫ్రెండ్స్ తో కలిసి ముంబైలోని లోకల్ ట్రైన్ లో జర్నీ చేశానని, ఆ జర్నీ టైమ్ లో తనని ఒకతని ప్రవర్తన చాలా భయపెట్టిందని మాళవికా మోహనన్ తెలిపింది. మరో సినిమాను ఓకే చేసిన ప్రభాస్ జర్నీ చేస్తున్న టైమ్ లో ఆ కంపార్ట్మెంట్లో తను, తన స్నేహితులు తప్ప ఎవరూ లేరని, ఆ టైమ్ లో ఒకతను తమ కంపార్ట్మెంట్ లోకి వచ్చేందుకు ట్రై చేశాడని, అక్కడున్న గ్లాస్ డోర్ నుంచి తొంగిచూస్తూ ముద్దిస్తావా అని సైగలు చేశాడని, అతని ప్రవర్తన తనను, తన ఫ్రెండ్స్ ను భయపడేలా చేసిందని, ఆ టైమ్ లో అసలేం చేయాలో అర్థం కాలేదని మాళవిక వెల్లడించింది. అలా భయపడుతూ ఉండగా ట్రైన్ మరో స్టేషన్ కు వచ్చిందని, అక్కడ తమ కంపార్ట్మెంట్ లోకి మరికొంత మంది వచ్చాక తమ భయం మొత్తం పోయిందని మాళవిక తెలిపింది. ఇక హీరోయిన్ లుక్స్ విషయంలో కూడా మాళవిక మాట్లాడింది. కొంచెం బరువు పెరిగి నార్త్ లో సినిమా చేయాలనుకుంటే అక్కడ ఛాన్సులు రావని, నార్త్ సినిమా కోసం కొంచెం సన్నబడి తిరిగి సౌత్ కు వస్తే ఇక్కడ బొద్దుగా ఉంటేనే బావుంటావంటారని మాళవిక తనకు ఎదురైన అనుభవాలను చెప్పుకొచ్చింది. దీంతో ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తల్లో కన్ఫ్యూజ్ అయ్యానని, తర్వాత మెల్లిగా సిట్యుయేషన్స్ అర్థమయ్యాయని ఏదేమైనా ఫిట్‌గా, హెల్తీగా ఉండాలని డిసైడ్



అయినట్టు అమ్మడు తెలిపింది. తన కెరీర్ స్టార్టింగ్ లో సన్నగా ఉన్నానని ఎంతోమంది ట్రోల్ చేశారని, ఆ తర్వాత కొంచెం లావు అయ్యేసరిగా అప్పుడు కూడా తనను విమర్శించారని చెప్పిన మాళవిక దక్షిణాది హీరోయిన్లు ఎక్కువగా బొద్దు మీదనే ఫోకస్ చేస్తారని, సోషల్ మీడియాలో కూడా బొద్దు కనిపించేలా దిగిన ఫోటోలనే షేర్ చేస్తారని సంచలన వ్యాఖ్యలు చేసింది మాళవిక.

# హైబ్రిడ్ పిల్లతో అందుకే అందరికీ ఇబ్బంది!

సాయి పల్లవిని సినిమాకు ఒప్పించాలంటే ఎంత కష్టమవుతుంది? అన్నది ఓ సందర్భంలో చందు మొండేటి ఎంతో ఓపెన్ గా చెప్పిన సంగతి తెలిసిందే. సాయి పల్లవిని సినిమాకు ఒప్పించాలంటే ఎంత కష్టమవుతుంది? అన్నది ఓ సందర్భంలో చందు మొండేటి ఎంతో ఓపెన్ గా చెప్పిన సంగతి తెలిసిందే. ఆమెతో కలిగిన అనుభవాన్ని చందు రివీల్ చేసాడు. ఆ సమయంలో కథ, పాత్రల విషయంలో సాయిపల్లవి రెయిజ్ చేసే డౌట్లు మామూలుగా ఉండవు..ఆమెతో ఎవరు సినిమా తీయాలన్నా? ఒప్పించాలన్నా వాళ్లకు చుక్కలు కనిపిస్తాయన్నారు. సాయి పల్లవిని ఒప్పించడం అంటే? ఏ డైరెక్టర్కి అయినా ఓ సవాల్ గానే ఉంటుందని తన అనుభవాన్ని చెప్పే ప్రయత్నం చేసారు. తాజాగా సాయి పల్లవి కథలను ఎలా ఎంచుకుంటుందో రివీల్ చేసింది ఎలాటి పాత్రలోనైనా దాని లోతెంత అని చూస్తా. ఆ పాత్రలో బరువైన భావోద్వేగం ఉందా? లేదా? అన్నది ఎక్కువగా చూస్తా. దాని మీద నాలో నేనే విశ్లేషణ చేసుకుంటా. నటిస్తే ఎలా ఉంటుంది అన్నది మాత్రం సీరియస్ గా ఆలోచన చేస్తా. అన్నది తర్వాత సంగతి ఆ పాత్ర ద్వారా ప్రేక్షకుల్లో ఎంత వరకూ గుర్తింపు వస్తుందన్నది చూసుకుంటా. ఎందుకంటే ప్రేక్షకులకు నిజాయితీగల కథలు మాత్రమే చెప్పాలి. ఏ పాత్ర పోషించినా అందులో భావోద్వేగానికి ప్రేకేక్షకులు కనెక్ట్ అవ్వాలి. అలా కనెక్ట్ కాలేనప్పుడు ఎంత గొప్ప పాత్ర పోషించినా అది వృద్ధా ప్రయత్నమే అవుతుంది. అవార్డుల కన్నా ప్రేక్షకుల ప్రేమను గెలుచు కోవడం అన్నది గొప్ప విషయం. కానీ.. అవార్డుల గురించి ఎప్పుడు ఆలోచించను. ప్రేక్షకుల మెప్పు తర్వాత అవార్డులు వస్తే దాన్ని బోనస్ గా మాత్రమే భావిస్తాను. అలా అవార్డులకు రెండో ప్రాధాన్యత ఇస్తానని తెలిపింది. సాయిపల్లవి అందుకే తక్కువ సినిమాలు చేయగల్గింది. నటిగా తనకంటూ కొన్ని పరిమితులు విధించుకుని కొనసాగుతుంది. ప్రకటనల్లో కనిపించదు...గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటుంది. కోట్లు ఇస్తామన్నా నో ఛాన్స్ అంటూ రిజెక్ట్ చేస్తుంది




# ది పర్ఫెక్ట్ బోల్డ్ బ్యూటీ..!



శ్రీదేవి కూతురు జాన్వి కపూర్ బోల్డ్ ఇమేజ్ సంపాదించేందుకు బాగానే కష్టపడుతుంది. సినిమాల ఫలితాలు ఎలా ఉన్నా సరే రెగ్యులర్ గా తన లేటెస్ట్ ఫోటో షూట్స్ తో తన మీద ఫోకస్ మిస్ అవకుండా చేస్తుంది. అందుకే రోజు ఒక కొత్త అవతారంలో కనిపిస్తుంది. గ్లామర్ షోలో తనకంటూ ఒక ప్రత్యేక ఉందంటూ ఆమె చేస్తున్న స్కిన్ షో చూస్తేనే అర్థమవుతుంది. మడి కట్టుక్ కూర్చుంటే అవకాశాలు కష్టమే అందుకే గ్లామర్ గేట్లు పూర్తిగా ఎత్తేసి తన అందాలతో అలరించేస్తుంది

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com